# నందనవనం – 4

ఆ తర్వాత ముగ్గురూ కలిసి ఎక్కడి నుండో తెప్పించిన రకరకాల పూలమొక్కల్ని ఓ పద్ధతిగా నాటే పని మొదలు పెట్టారు. కొన్ని చోట్ల విత్తనాల్ని చల్లారు.

ఆ పని చేస్తూనే కబుర్లు చెప్పుకున్నారు.

''మొక్కల్ని నాటే మంచి అలవాటు అందరికీ అలవరచాలని తాతగారు మాటలతో చెప్పటం కాకుండా చేసి చూపించాలనే పద్ధతితో ఇంటిముందు ఎన్నో మొక్కల్ని పెంచేవారని మా నాన్న చెప్పారు. అందుకే నేనూ ఈ ఇంటిని అలా తీర్చిదిద్దాలనే ఈ పని పెట్టుకున్నాను.'' అంటూ ఇంటికి ఓ పక్కగా జామ, పనస, మామిడి లాంటి పండ్ల మొక్కల్నీ, వెనుక వైపు అరటి పిలకల్నీ నాటారు. ''ఇవన్నీ పండ్లు కాసే నాటికి మనం ఉంటామా, తింటామా అనే ఆలోచన లేకుండా పెంచటమే మన బాధ్యతగా భావించాలి !'' అంది శ్రీవల్లి.

''మొక్కల వలన మనుష్యులకు ఉన్న ప్రయోజనాల సంగతి అటుంచితే, పచ్చదనంతోనే కనువిందు చేస్తుంటాయి కదండీ!'' అన్నాడు సూర్యం,

''అవునవును ... కొన్ని మొక్కలు మౌనంగా ఉన్న మునీశ్వరుల్లా

ఉంటే, మరికొన్ని ఆకుల గలగలతో కబుర్లు చెబుతున్నట్లనిపిస్తాయి..!''

ఆయన మాటలకు చురుగ్గా చూసిన శ్రీవల్లి సూర్యం వైపు చిరునవ్వుతో చూస్తూ అంది ''నేను ఓరోజు మౌన వ్రతం చేయటానికి ఈయన నీకు ఏం కారణం చెప్పారో తెలియదుగానీ... అసలు కారణం నేను చెబుతాను.. విను. ఎపుడో ఓసారి నేనేదో చెబుతోంటే, ఈయనగారేం బదులు మాట్లాడకుండా ఉండిపోతే, నాకనుమానం వచ్చి 'ఏం

మాట్లాడరేం?' అని కొంచెం గట్టిగానే అడిగాలే. దానికాయన ఏం జవాబు చెప్పారో తెలుసునా.... 'వినటమూ మంచి అలవాటే... అదే చేస్తున్నాను. చిల్లర గలగలమంటుంది గానీ నోట్ల కట్ట మౌనంగానే ఉంటుంది కదా అన్నారు.' దాని అర్థం బోధపడి అప్పటినుండీ... నోట్లకట్టలా నేనూ మౌనంగా, హుందాగా ఉందామని నిర్ణయించుకున్నా! ప్రాక్టీసు కోసం ముందుగా వారానికి ఓ రోజు మౌన వ్రతం అంటూ మొదలుపెట్టానన్నమాట! సూర్యం... నీకిపుడు అర్థమైందా... నా మౌనవ్రతానికి మూలకారణం ఎవరో, ఏమిటో...?''

''అర్థమైందండి. వినే మంచి అలవాటుతో పాటూ ఇంతరులను పరిశీలించి, అర్థం చేసుకునే అవకాశమూ ఉంటుంది!'' అన్నాడు సూర్యం.

వెంటనే ఆయన నవ్వుతూ శ్రీవల్లివైపు చూశాడు. దానికి ఆవిడ నిట్టూరుస్తూ నిష్ఠూరంగా చూసింది. ఆవిడ ఆయనగారి వైపు కోపంగా చూసినా కూడా, మురిపెమే ఎక్కువగా కనిపిస్తుంటుందని అనుకుంటూ లోలోపలే నవ్వుకున్నాడు సూర్యం.

''అయితే, ఇంత మంచి ఫలితం ఉంది కాబట్టి... మౌనవ్రతం రోజుల్ని ఇంకా పెంచితేనే మంచిదేమో...!'' అంది శ్రీవల్లి.

ఆయన చిరునవ్వుతో సూర్యం వైపు చూశాడు. ''ఆవిడ గారి నిందలు నమ్మకు సూర్యం. ఆవిడ మాట్లాడకపోతే నా కస్సులు తోచదు. ఆ ఒక్కరోజు మౌనాన్నే తట్టుకోలేక సాయంకాలం అయ్యే సరికి ఏటి ఒడ్డుకు వెళ్ళి అలల సవ్వడీ, తోటలోకి వెళ్ళి చెట్లు ఆకుల గలగలల కబుర్లు వినీ, ఇంటికి వస్తాను. ఆ లోటు ఇలా భర్తీ చేసుకుంటానన్న మాట ! ఆవిడ రోజూ మౌనంగా ఉంటే... ఇంకేమైనా ఉందా... ఆక్సిజను అందనట్లు గిలగిలలాడిపోనూ..!'' అంటూ భయం నటించేసరికి శ్రీవల్లీ, సూర్యం ఇద్దరూ నవ్వేసారు.

అలా సరదా కబుర్ల మధ్య పని పూర్తి చేసి అందరూ శుభ్రంగా మట్టి చేతులు కడుక్కుంటుండగా ఒకతను వచ్చి పద్మనాభ స్వామి వస్తున్నారనే కబురు చెప్పి వెంటనే వెళ్ళి పోయాడు.

ఎవరు, ఏమిటి అన్నట్లుగా ఆయన ఆలోచిస్తుంటే సూర్యం వివరంగా చెప్పాడు.

''మన ఊరుకీ, పక్కవూరుకీ మధ్య ఉన్న పెద్ద ఖాళీ స్థలంలో కోటలాంటి ఇల్లు ఉంటుంది చూడండీ. అది ఈయనగారిదేనండీ. మకుటంలేని మహరాజులా ఆయన ఈ రెండు ఊళ్ళ జనాల మీద పెత్తనం చేస్తారు ! ఆయనైతే, తనని తాను భగవంతుని అవతారంలా భావిస్తారేమో మరి... అందుకే పెద్దలు పెట్టిన పద్మనాభ మూర్తిని, చివర మూర్తి అనే మాట తీసేసి స్వామిగా మార్చేసుకున్నారు! తనపట్ల ప్రజలకి ఉన్న భక్తి వలన అలా పిలుస్తారని ఆయన చెబుతూంటారనుకోండి... ఏది నిజమో మరి!''

సూర్యం చెబుతూండగానే ఆయన తడికె తలుపు తీసుకుని రావటం గమనించిన సూర్యం లోపలనుండి ఓ పెద్ద పడక కుర్చీలాంటిది తీసుకు వచ్చి ముందు అరుగుపై వేసాడు. ఇంకో కుర్చీ కూడా తెచ్చి దాని పక్కనే వేసాడు.

ఆయన అనుచరుల్లో ఒకతను వచ్చి తన భుజం మీద ఉన్న చిన్న తుండు గడ్డతో తుడవగానే పద్మనాభస్వామి ఠీవిగా కూర్చుని అటూ ఇటూ పరికించి చూశాడు.

''ఫరవాలేదు, పాడుబడిన ఇంటికి కొంచెం మంచి రూపురేఖలే తెచ్చారు...'' అన్నాడు చిరునవ్వుతో....పక్కనే కుర్చీలో కూర్చున్న ఆయనతో.

ఒక నిముషం ఆగి, నిలబడి ఉన్న సూర్యాన్ని చూసి ''నువ్వూ... ఎంకన్నగాడి కొడుకువి కదూ.. ఏదో చదువుతున్నావని అన్నారే, ఈ ఊళ్ళో ఏం చేస్తున్నావూ, వీరింటికెందుకు వచ్చావు....?.'' అనడిగాడు.

చేతులు కట్టుకుని నిలబడి ఉన్న సూర్యం వినయంగా జవాబిచ్చాడు.

''అవునండి.. నేను వెంకటాద్రి కొడుకునే. ఇపుడు కాలేజికి సెలవులిచ్చారుకదండీ, ఇంటికి వచ్చాను. ఇక ఇక్కడికెందుకు

వచ్చానంటారా... లైనులో ముందు నిలబడిన వాడికి ముందుగా దైవ దర్శనం కలిగినట్లుగా, ఊరి మొదట్లో ఉన్న మా పొలంలో మా నాన్నకి సాయం చేద్దామని వచ్చిన నాకు వీరి కుటుంబంతో పరిచయభాగ్యం కలిగింది! ఆ పరిచయంతో అప్పుడప్పుడూ ఇలా వచ్చి చూసిపోతుంటానండీ!''

పద్మనాభం కొంచెం వ్యంగ్యంగా నవ్వినట్లు నవ్వుతూ ''చుట్టానివా, సాటివాడివా చూసిపోవటానికి, ఏదైనా పని ఉంటే, కబురు పెడతారు, చేసిపోతూండు...'' అన్నాడు. వెంటనే ఆయన వైపు తిరిగి ''వీడి బాబు... అదే ఎంకన్న మా దగ్గర చాలానాళ్ళు పాలేరుగా చేసినవాడే. ఏదో కొంత కూడబెట్టుకుని రెండెకరాలు కొనుక్కుని బాగుపడ్డాడు. కొడుకునీ చదివిస్తున్నాడు.'' అంటూ సూర్యం కటుంబం వివరాలు చెప్పుకొచ్చాడు.

ఆయన తృళ్ళి పడి సూర్యం వైపు చూశాడు.

సూర్యం ఆ మాటలకు నొచ్చుకున్నట్లు కనిపించలేదు. మామూలుగానే ఉన్నాడు.

ఆయన పద్మనాభమూర్తికి వివరణ ఇచ్చాడు ''మీరన్నట్లుగా కాకుండా ఈ సూర్యాన్ని మా కుటుంబ సభ్యుడిగా భావించి మా ఇంటిపనులు సరదాగా పురమాయిస్తాముగానీ పెద్దగా పనులేం ఉండవులెండి. కొందర్ని చూసీ చూడగానే ఆత్మీయత కలుగుతుంది. ఈ ఊళ్ళో అడుగు పెట్టగానే ఈ సూర్యంతో పరిచయం కలగటం మాకూ అదృష్టంగా అనిపించింది! మాకు రెండో కొడుకు లభించిన ఆనందమూ కలిగింది!''

నిజాయితీగా ఆయన చెప్పిన మాటలకు పద్మనాభం కొంచెం ఆశ్చర్యంగా చూసాడు. అంతలోనే గుమ్మం దగ్గర నిలబడిన శ్రీవల్లిని చూసి సూర్యం చటుక్కున వెళ్ళి ఆవిడ చేతిలో ఉన్న పళ్ళాన్ని అందుకున్నాడు. రెండు గ్లాసులతో మజ్జిగ ఉంది.

అలాగే పట్టుకుని సూర్యం ముందుగా పద్మనాభం దగ్గరకు వెళ్ళాడు. ఓ క్షణం నిరసనగా ఆ గ్లాసులవైపు, సూర్యం వైపు మార్చి మార్చి చూశాడు. పద్మనాభానికే వినిపించేట్లుగా సూర్యం చాలా మెల్లగా చెప్పాడు.

‘‘అమ్మగారు ఇచ్చిన పళ్ళాన్ని మాత్రమే పట్టుకున్నానండీ. గ్లాసుల్ని తాకనే లేదు...’’

ఆ మాటలతో ఆయన మొహంలోకి కొంచెం ప్రసన్నత వచ్చి.. ఒక గ్లాసు చేతిలోకి తీసుకున్నాడు. రెండో గ్లాసు ఆయన తీసుకున్నాక సూర్యం ఆ ప్లేటు పట్టుకుని ఇంట్లోకి వెళ్ళకుండా ముందు వైపు నుండి వెనక పెరట్లోకి వెళ్ళాడు.

పద్మనాభం ఆయనతో ‘‘ఈ ఊరివాళ్ళకు కులాల పట్టింపు బాగా ఉందండి. మీరు కొత్తగా వచ్చారు కాబట్టి వీడి కులం గురించి తెలియక ఇంట్లోకి రానిస్తూ బంధువులా భావిస్తున్నారు. మీరు చాలా బోళా మనుష్యుల్లా ఉన్నారు. ఆపైన పట్నాల్లో పుట్టి పెరిగిన వాళ్ళాయె, ఈ ఊరి వాళ్ళ కులాల జాడ్యం గురించి మీకంతగా తెలియకపోవటంలో వింత ఏం లేదనుకోండి. ఎందుకైనా మంచిది... తక్కువ జాతి వాళ్ళని అంత తొందరగా నమ్మటం మంచిదికాదు. కొంచెం దూరంగానే ఉంచండి. మీ మేలుకోరి చెబుతున్నా నంతే.’’ అంటూ ఓ నిముషం ఆగి మళ్ళీ అన్నాడు.

‘‘మిమ్మల్ని ఏమని పిలవాలో అర్ధం కావటంలేదు. ఈ ఊరివాడే ఒకాయన చెప్పాడు ... మీకు మీ వాళ్ళు పెట్టిన పేరు తమాషాగా ఉందట కదా.. చివర రాయి, రప్పా, అంటూ ఏదో ఉంటుందటా... అరుగులబడి అయ్యవారి మనవడు అంటూ అంతా చెప్పుకుంటున్నారుగానీ ఎప్పటికీ అంత పొడుగు పేరుతో మాట్లాడుకోలేం కదా.. అందుకని ‘రావుగారు’ అంటే సరిపోతుందనుకుంటున్నా... ఏమంటారూ...?’’

‘‘నేనేమంటానూ... మీ ఇష్టమనే అంటాను. ఎలా పిలిచినా నాకు బాగానే ఉంటుంది. మా నాన్న తాతగారి పేరును కొంచెంగా మార్చి

‘శుభాంశురాయ్’ అని పెట్టారా... మా నాన్నమ్మ మాత్రం ‘సుబ్బా’ అనే పిలిచేది. అపుడపుడూ మా ఆవిడా అలాగే అంటుంది. నన్నేదో

ఉడికించటానికనుకుంటుంది గానీ, మా నాన్నమ్మ పిలిచిన ఆ పేరంటే నాకు చాలా ఇష్టం!’’

ఆ మాటలకు పద్మనాభం కూడా చిరునవ్వు నవ్వి ''సరేరావు గారూ... నేనూ అప్పుడప్పుడూ సుబ్బయ్య గారూ అనీ పిలుస్తా.'' అన్నాడు.

అంగీకార సూచకంగా ఆయన చిరునవ్వు నవ్వాడు.

పద్మనాభ మూర్తి కొంచెం స్వరం తగ్గించి ''నేను చెప్పిన మాట కొంచెం ఆలోచించండి. ఆ సూరిగాడిని మరీ దగ్గరకు రానియ్యకండి. నా కంటే... ఈ ఊరి పెద్దగా కులాల పట్టింపు లేదుగానీ... ఈ ఊళ్ళో ఉంటున్నపుడు... వీళ్ళ నమ్మకాల్ని మనం కొంచెం పట్టించుకోవాల్సిందేగా, తప్పదు మరి!'' అన్నాడు.

ఆయన కాంచెం పెద్దగానే నవ్వేసాడు ''మీలాగే నాకూ ఎటువంటి పట్టింపూ లేదు. కొన్నాళ్ళలో మనం ఈ ఊరివాళ్ళ జాడ్యాన్ని కూడా వదిలిద్దాం! అదేమంత కష్టం కాదు. మన ఊరు వాళ్ళకి జబ్బు చేస్తే.... వదిలించే ప్రయత్నం చేయాలిగానీ మనమూ అంటించుకోవటం ఎందుకు చెప్పండీ...? మనష్యులందరిదీ ఒకటే కులం అనే నమ్మకాన్ని కలిగించి... అందరికీ ఆరోగ్యాన్ని అందిద్దాం!''

''మీలాంటి పెద్దవాళ్ళు తలుచుకుంటే.. సాధ్యమౌతుందేమో.. చూద్దాం!'' అంటూ పద్మనాభం నిట్టూర్చాడు.

వెంటనే ఆయన జవాబు చెప్పాడు. ''నా ఒక్కడి వల్లా సాధ్యం కాదుగానీ మీ లాంటివాళ్ళ సహకారం ఉంటే మాత్రం తప్పకుండా వీలవుతుంది! మీ గురించి చాలా విన్నా, ఈ చుట్టుపక్కల వూళ్ళన్నిటికీ మీరే రారాజులాంటి వారనీ, మీది కోటలాంటి ఇల్లనీ చాలా గొప్పగా చెప్పారు! ఆపైన... ఓసారి అగ్ని ప్రమాదం జరిగి ఎన్నో పాకలు కాలిపోతే, వాళ్ళందరికీ మీరే ఆశ్రయమిచ్చి, అన్న పానాదుల ఏర్పాట్లు చేసి ఆదుకున్నారనే విషయమూ విన్నాను, అందుకే మీలాంటి మంచి వ్యక్తుల పరిచయం కోసం నేనే మీ ఇంటికి వద్దామనుకుంటూంటే, మీరే వచ్చారు. చాలా సంతోషమండీ!''

ఆ మాటలకు పద్మనాభం వదనం పువ్వులా వికసించి కళకళలాడిరది. సంతోషంగా బదులు చెప్పాడు. ''ఏదో మమ్మల్ని నమ్ముకున్న పేదవాళ్ళని ఆదుకోవటం నా కర్తవ్యంగా అనిపించింది. అలా

ఓ పదిరోజులు ఆదుకున్నామంతే. అదే మీ లాంటి వాళ్ళయితే ఏమైనా చేయగలరు ! ఒక చిన్న సందేహం మీరు... ఈ ఊళ్ళో ఏదైనా పరిశ్రమలాంటిది పెట్టే ఉద్దేశ్యంతో వచ్చారా....?''

లేదన్నట్లుగా తలవూపిన ఆయన ''నేనూ సొంత వూరులోనే ఉండి ఏదో ఉపాధి చూసుకుందామని వచ్చాను. ఎవరివైనా కౌలుకు పొలాలు ఇప్పిస్తారేమోనని మిమ్మల్ని అడుగుదామనీ అనుకున్నాను. అందుకని కూడా మీ దగ్గరకు వచ్చి కలవాలనుకున్నా.''

ఆ మాటలకు పద్మనాభం ఉలిక్కి పడ్డాడు.

''కౌలు అన్నమాట... నేను సరిగ్గానే విన్నానా... లేక మీరేదో అనుకున్నట్లుగా చెబితే, నాకలా వినిపించిందా...?''

''మీరు సరిగానే విన్నారు. మీరూహించినట్లుగా పరిశ్రమలు స్థాపించేంత స్తోమత ఇప్పుడు లేదులెండి. ఆ వైభోగం అంతా గత చరిత్రలా మారిపోయింది! కొన్ని తప్పుల వలన ఆస్తిపాస్తులన్నీ కరిగిపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో నా కుటుంబ భారమూ మా నాన్న భుజాలపై ఉంచటం ఇష్టం లేక బయటకు వచ్చేసాను! వ్యవసాయం చేసి మెల్లగా కాలూ చేయీ కూడదీసుకుని స్థిరపడగలిగితే చాలనిపిస్తోంది ! కొడుకు చదువు, పెళ్ళి లాంటి బాధ్యతలు తీరిపోతే, మా ఇద్దరికీ ఎంత కావాలీ. నిశ్చింతగా బ్రతికేయవచ్చనే అభిప్రాయంతోనే ఈ ఊరుకు వచ్చాం.''

విస్తుపోయిన పద్మనాభం ఆ వార్త నిజమేనా అని నాలుగైదుసార్లు రెట్టించి అడిగి, నిజమేననే నిర్ధారణకు వచ్చాడు.

''మరీ అంత కట్టుబట్టలతో బయటపడ్డట్లుగా ఎలా వచ్చారూ...? ఏవో టాక్సు గొడవల కోసం అయినా మీ పేర ఎన్నో కొన్ని ఆస్తిపాస్తులు ఉండే ఉంటాయిగా ....?'' తన చివరి సందేహాన్నీ బయట పెట్టాడు.

''మా నాన్న కొంచెం నిరసనగా, నిష్టూరంగా మాట్లాడేసరికి ఏవీ నేను ఉంచుకోలేదు. అన్నీ వదిలేసాను. నా దగ్గర్నుండి ఆయన తీసుకోలేని ఆస్తిపాస్తులతో మాత్రమే వచ్చేసాను..!''

ఆ మాటలకి పద్మనాభం ''పోనీలెండి... కొన్నయినా మిగుల్చుకున్నారు. అయినా మీకు కన్న తండ్రితో ఆస్తి దగ్గర పంతం పట్టింపూ ఏమిటండీ..? కొంతయినా దక్కించుకున్నారు కాబట్టి మళ్ళీ నిలదొక్కుకోవటం ఏమంత కష్టం కాదు! మీ ఆస్తిపాస్తుల్ని బట్టి కొంతే అయినా, అదే పెద్ద మొత్తం మాలాంటి వాళ్ళకి! మీరు ఎంత కోటీశ్వరులో, మీకెన్ని ఫాక్టరీలు ఉన్నాయో... ఈ ఊళ్ళో వాళ్ళం కథలు కథలుగా చెప్పుకుంటాం...!'' అంటూ నిట్టూర్చాడు.

ఆయన చిన్నగా నవ్వాడు. ''తిరిగి తీసుకోలేని ఆస్తి అంటే, మీరు వేరే విధంగా అనుకుంటున్నారని నాకర్థం అయింది! నా పేర రాసిన వాటిని తిరిగి ఇవ్వనని మొండికేశాననుకున్నారా... కాదండీ, మా నాన్న మాకు ఇచ్చినవీ, తిరిగి తీసుకోలేని ఆస్తులు అంటే... కష్టపడే తత్వం... క్రమశిక్షణ! అవి చాలనుకున్నాను! హాయిగా బ్రతకగలమనే ధైర్యం వచ్చింది వాటివల్లే!''

పద్మనాభం అయోమయంగా చూశాడు. నిజమే చెబుతున్నాడనే నమ్మకం కలిగి నిరసనగా లేచి నిలబడ్డాడు.

''మీరు చేసిన పని నాకేమీ నచ్చలేదు.'' పద్మనాభం మాటల్లోని కటువును గమనించిన ఆయన చిన్నగా నిట్టూర్చి చెప్పాడు ''విధి వ్రాతని తప్పించుకోలేమని మన పెద్దలు అందుకే అంటారు. ఒక్కోసారి ఉప్పెనలా వచ్చిపడిన ఆస్తిపాస్తులు అలాగే పోతాయి, తట్టుకోవాల్సిందే ! మా ఇంట్లో లక్ష్మి సరస్వతుల పటం ఒకటి ఉంటుంది. లక్ష్మీదేవిది చంచల స్వభావం అంటారుగా, ఆ భావాన్ని తెలియజేయటానికేనేమో.... కాసులు కురిపిస్తూ నిలబడే ఉంటుంది.... ఏ క్షణమైనా వెళ్ళిపోవటానికి తయారుగా ఉన్నట్లు! సరస్వతీ దేవి మాత్రం నిశ్చలంగా కూర్చుని వీణ వాయిస్తూ ఉంటుంది! లక్ష్మీదేవి వదిలి వెళ్ళిపోయినా భయపడకూడదని దానిని బట్టి నాకర్థం అయింది! తెలివి తేటలు ఉండి శ్రమ జీవనం తెలిస్తే చాలు.... బ్రతకటం ఏమంత కష్టం కాదు..!''

''అంతా మాయమై పోయాక ఎవరైనా చేసేది ఏం ఉందీ, ఇలాంటి వేదాంతాన్ని నమ్ముకుని బ్రతకాల్సిందే. తప్పదు! సరే, అంత ధైర్యం ఉంటే అలాగే కానియ్యండి, మీరేదో పెద్ద పెద్ద పరిశ్రమలు పెట్టటానికి

వచ్చారేమో, నాలాంటి వాళ్ళ సాయం, సహకారం అవసరం అవుతాయేమోనని ఓ మాట చెబుదామని వచ్చా. మీరేదో కూలీ జనంలా కష్టపడతానంటే... సరే, కాదనేదేముందీ, ఎవరికైనా రోజు గడవాలీ, పొట్టనిండాలి! మీ కిపుడు సూరిగాడు లాంటి వాడే సరైన తోడు! ఏమైనా కౌలు ఇప్పించే పనులు లాంటి విషయాలలో సాయం చేస్తాడు!

ఇంకో మాటా చెబుతున్నాను. నాకు మొదటే ఇలాంటి విషయం ఏదో ఉందనే అనుమానం వచ్చింది. లేకపోతే అంత కోటీశ్వరుడి కొడుకు... ఈ ఊళ్ళో ఉండాలనుకుంటే, కోట్లు ఖర్చుపెట్టి పెద్ద భవంతీ కట్టించుకుంటాడు గానీ.. ఏనాటిదో తాతగారి పాత కొంపను బాగుచేయించుకుని మకాం పెడతాడా అని ! కానీ... ఏమో వెర్రి వేయి విధాలన్నారుగదాని మళ్ళీ సరిపెట్టుకున్నాను! అసలు విషయం ఇపుడు మీ ద్వారానే బయటకు వచ్చింది!''

పద్మనాభం మళ్ళీ ఓ సారి తేలికగా చూసి రెండడుగులు వేసి ''ఇక వెళ్ళొస్తాను. 'రావు గారూ' అనటం కంటే... నీకు ఇష్టమైనట్లు 'సుబ్బయ్యా' అంటేనే బావుంటుందేమో... ఏమంటావు సుబ్బయ్యా ?'' అన్నాడు.

ఆమాటల్లోని వ్యంగ్యానికి ఆయన నొచ్చుకోలేదు, మనసులోనే చిన్నగా నవ్వుకున్నాడు.

''నాకేమీ రావు అనే నిజం తెలుసుకుని అలా అన్నారేమో అనుకున్నా. ఇపుడు నా ఇష్టం తెలిసి అభిమానంగా సుబ్బయ్యా అన్నారు. నాకు చాలా బావుంది ! పేరుని బట్టి కాకుండా మనిషిని బట్టి గౌరవ మర్యాదలు పొందాలనుకునే బాపతులెండి నేను!''

ఆ మాటల్ని మౌనంగా విని పద్మనాభం చకచకా అడుగులు వేసాడు. వేచి ఉన్న అనుచరులు వెంటరాగా వెళ్ళిపోయాడు.

అప్పటివరకూ వాళ్ళిద్దరి మాటలు వింటూ లోపలే ఉన్న శ్రీవల్లీ, ఇంటి పక్కగా నిలబడి ఉన్న సూర్యం ముందుకు వచ్చారు, మళ్ళీ ముగ్గురూ కాసేపు ముచ్చట్లు పెట్టుకున్నారు. ముందుగా శ్రీవల్లే అంది ''సూర్యం.... ఆయన మాటల్ని బట్టి... పని పురమాయించటం కోసమే నేను

నీ కోసం ఎదురు చూశానని, కబురు పెట్టాలనుకున్నాననీ అపార్థం చేసుకోలేదు గదా....?''

సూర్యం చిరునవ్వుతో అన్నాడు. ''అమ్మ గురించి మనకి తెలియదా..., వేరెవరో మాటల్ని బట్టి అపార్థం చేసుకుంటామా....?''

ఆవిడ స్థిమితపడినట్లు నిట్టూర్చింది. ''అవును.. నిజం చెప్పావు..!''

''అదిసరేగానీ, పద్మనాభం గారేమిటో కులాల ప్రస్తావన చేశారు! నువ్వేమైనా చిన్న బుచ్చుకుంటావేమోనని కొంచెం ఆందోళన పడ్డాను. అయితే నువ్వేమీ బాధపడినట్లుగా అనిపించలేదు. మామాలుగానే ఉన్నావు... నిజమేగా...?''

******